బంగారం షాపులో చోరీ..ముగ్గురు అరెస్ట్

పోలీసుల అదుపులో నిందితులు

గోల్కొండ, మే 8: అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ బంగారం దుకాణంలో చోరీకి పాల్పడిన ముగ్గురిని అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ హాఫీజ్ ఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం...పాతబస్తీ మొఘల్‌పురాకు చెందిన సయ్యద్ ఆరీఫ్ ఉద్దీన్ , షేక్ అహ్మద్ ఉద్దీన్, నసీమా బేగం(40), కయాం సుల్తానాలు ఈ నెల 5న అంబర్‌పేట, తిరుమలనగర్‌లోని భవన్‌లాల్ బంగారం షాపుకు వెళ్లారు. అధిక బరువు గల బంగారు గాజులు చూపించాలని కోరారు. ఒక ట్రేలో బంగారు గాజులు చూపిస్తుండగా రోల్డ్‌గోల్డ్ బంగారు గాజులతో షాపు యజమాని దృష్టి మళ్లించి అక్కడి క్యాష్ కౌంటర్ నుంచి రూ.2లక్షల నగదును దొంగతనం చేసి అక్కడి నుంచి ఉడాయించారు. ఇది గమనించిన యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా .. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించి ముగ్గురు నిందితులను గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీ చేసిన రూ.2లక్షల నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

నేపాల్ దొంగలు ఎక్కడ..?

వృద్ధ దంపతులకు మత్తుమందు ఇచ్చిన కేసులో ఇంకా దొరకని ఆచూకీ

ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు

కాచిగూడ, మే 8: ఏప్రిల్ 20న రాత్రి కాచిగూడ లింగంపల్లిలోని ఓ పారిశ్రామిక వేత్త ఇంట్లో వృద్ధ దంపతులకు మత్తుమందు ఇచ్చి, దోపిడీకి పాల్పడిన కేసులో ప్రధాన నిందితులైన నేపాల్ దొంగల జాడ ఇప్పటికీ దొరకలేదు. లింగంపల్లిలోని అమ్మవారి దేవాలయం పక్కన ఉంటున్న హెమ్ రాజ్ దుగ్గల్, భార్య మీనా దుగ్గల్‌లు గత నెల 20న రాత్రి నేపాల్ పనిమనుషులు ఆ వృద్ధ దంపతులకు జీరా రైస్, తాగు నీళ్లలో మత్తుమందు ఇచ్చారు. అనంతరం వారు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోగా ఆ ఇద్దరు పని మనుషులతో పాటు మరో ముగ్గురు కలిసి అదే రోజు రాత్రి ఇంట్లో ఉన్న బీరువాను పగలగొట్టి రూ.70 లక్షలు, కిలోన్నర బంగారు ఆభరణాలను తీసుకొని పారిపోయారు. ఈ ఐదుగురు నేపాల్ నిందితుల కోసం గత 18 రోజులుగా కాచిగూడ పోలీసులు ఢిల్లీ, నేపాల్ ప్రాంతాల్లో తీవ్రంగా గాలించినా.. ఇప్పటికీ ఆచూకీ లభించలేదు. నిందితుల కోసం నేపాల్‌లోని వారి ఇంటికి వెళ్లినా వారు అక్కడికి రాలేదని తెలిసింది. ఆ నిందితులు ఇతర ప్రాంతాల్లో ఉంటూ, తప్పించుకొని తిరుగుతున్నట్లు సమాచారం.

తప్పుడు పత్రాలతో భూమి విక్రయం.. నిందితుడు అరెస్ట్

నిందితుడు ప్రభాకర్ రెడ్డి

ఘట్ కేసర్, మే 8: తప్పుడు పత్రాలను సృష్టించి ప్లాట్లను అమ్మడంతోపాటు ఇతరుల భూమిని ఆక్రమించిన ఓ నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ వివరాల ప్రకారం..నల్లకుంటకు చెందిన సురేందర్ రెడ్డి ఘట్‌కేసర్ మండలం, కోర్రెములలోని సర్వేనంబర్ 740 /పార్ట్, 741/పార్ట్, 742 /పార్ట్ లలోని 6 ఎకరాల విస్తీర్ణం గల ప్లాట్లు చేయబడిన భూమిని కొనుగోలు చేశాడు. దాని పక్కన ఉన్న అదే సర్వే నంబర్లలోని 6,292 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన భూమిని ప్రభాకర్‌రెడ్డి అనే వ్యక్తి జీపీఏ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని.. తిరిగి వీరయ్య, సోమిరెడ్డిలకు విక్రయించాడు. అయితే ప్రభాకర్‌రెడ్డి అదే భూమిని మరికొంతమందికి అమ్మాడు. విషయం తెలుసుకున్న వీరయ్య, సోమిరెడ్డిలు 2011లో ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి.. అతడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై విడుదలైన ప్రభాకర్ రెడ్డి అదే భూమికి మళ్లీ నకిలీ పత్రాలు సృష్టించి.. ఇతరులకు విక్రయించాడు. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసినవారు వచ్చి చూసుకోగా సురేందర్‌రెడ్డి ప్లాట్లలోకి వస్తుంది. దీంతో బాధితుడు సురేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా తప్పించుకుతిరుగుతున్నాడు. కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో పోలీసులు నిందితుడు ప్రభాకర్‌రెడ్డిని గురువారంఅరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.

పోకిరీలపై ఉక్కుపాదం..

- 188 మందిని పట్టుకున్న షీ టీమ్స్
- తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్
- బాధితులు నిర్భయంగా షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయండి
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు

పట్టుబడిన పోకిరీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): మహిళలను, బాలికలను, యువతులను వేధించే పోకిరీలపై రాచకొండ షీ టీమ్స్ ఉక్కుపాదం మోపుతున్నదని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వెల్లడించారు. బాధిత మహిళలు, యువతులు నిర్భయంగా షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు. ఏప్రిల్ నెలలో డెకాయి ఆపరేషన్లు నిర్వహించి 188 మంది పోకిరీలను పట్టుకున్నామని, వారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు వెల్లడించారు. బస్టాండ్‌లు, రైల్లే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, రద్దీగా ఉండే కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయి ఆపరేషన్ కొనసాగిస్తూ సాక్ష్యాధారాలతో సహా పోకిరీలను పట్టుకొని న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నారని తెలిపారు. పట్టుబడ్డ వారిలో 132 మేజర్స్,56మందిమైనర్లు ఉన్నట్లు తెలిపారు.

ప్రధాన కేసులు ఇలా ఉన్నాయి.

- ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని హాస్టల్‌లో ఉంటూ డెంటల్ వైద్య పరీక్షల కోసం నగరానికి వచ్చి తిరిగి హాస్టల్‌కు వెళ్తుంది. ఆ సమయంలో తెలిసిన వ్యక్తి వచ్చి కాఫీ తాగుదామంటూ ఓయో రూమ్‌కు తీసుకెళ్లాడు. ఆ తర్వాత లైంగిక దాడికి యత్నించగా.. యువతి అడ్డుకోగా.. ఆమెను కొట్టాడు. గాయాలతో బయటకు వచ్చి పోలీసులను ఆశ్రయించింది.
- డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న యువతిని ఓ యువకుడు ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్నాడు. ఆమె నిరాకరించడంతో ఆమె ఫొటోలు మార్ఫింగ్ చేస్తానంటూ వేధింపులకు గురిచేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.
- డిగ్రీ చదువుతున్న యువతిని ప్రేమించాలంటూ వెంటపడుతూ వేధిస్తున్నాడు. అసభ్య పదజాలంతో ఆమెకు మెసేజ్‌లు పెడుతూ మానసికంగా హింసిస్తుండడంతో బాధితురాలు షీ టీమ్స్‌ను ఆశ్రయించింది.

ఆబ్కారీ దాడులు .. 14 కిలోల గంజాయి స్వాధీనం

స్వాధీనం చేసుకున్న గంజాయితో ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ మీదుగా ముంబై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు తనిఖీలు నిర్వహించా రు. ఈ తనిఖీల్లో 10కిలోల గంజాయి ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే....భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్లే రైలులో గంజాయి రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు గురువారం ఎస్‌టీఎఫ్ సీఐలు వెంకటేశ్వర్లు, నాగరాజులు.. సిబ్బందితో కలిసి కోణార్క్ ఎక్స్ ప్రెస్‌లో ఖాజీపేట నుంచి సికింద్రాబాద్ వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రైలులో అనుమానాస్పదంగా ఉన్న మూడు ప్యాకెట్లను తె రిచి చూడగా గంజాయి బయట పడిం ది. ఈ మొత్తం గంజాయి 10కిలోలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎస్‌టీఎఫ్ బృందాలు గంజాయిని స్వాధీనం చేసుకున్నాయి. తదుపరి విచారణ నిమిత్తం కేసును సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

మరో కేసులో....

నారాయణగూడ, వైఎంసీఏ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 2.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే...నగరానికి చెందిన ఆటోడ్రైవర్ విక్కీ పటేల్ ధూల్ పేట నుంచి గంజాయి కొనుగోలు చేసి నారాయణగూడ, వైఎంసీఏ ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలోనే విక్కీ పటేల్ గురువారం మధ్యాహ్నం ధూల్ పేట నుంచి తీసుకువచ్చిన గంజాయిని నారాయణగూడ, వైఎంసీఏ ప్రాంతం లో మరో ఆటోడ్రైవర్ సుమంత్‌కు విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు వారిద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.5కిలోల గంజాయితోపాటు రెండు ఆటోలు, మూడు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. కేసును తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

రహీంపురాలో...

ధూల్ పేటకు ఆనుకుని ఉన్న రహీంపూరలోని ఒక ఇంట్లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 1.518కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే...ధర్మసింగ్, మహేశ్‌సింగ్ , మనోజ్ సింగ్‌లు ధూల్‌పేటలోని ఇంట్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. సమాచారం అందుకున్న ఆబ్కారీ పోలీసులు గురువారం వారి నివాసాలపై దాడులు జరిపి.. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 1.518కిలోల గంజాయిని స్వాధీనం చేసున్నారు.

2.370 కిలోలు స్వాధీనం

పోచారం,మే 8: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 2.370 కిలోలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ రవి వివరాల ప్రకారం.. బోడుప్పల్ డంపింగ్ యార్డు ఎదురుగా ఉన్న సబ్‌స్టేషన్ సమీపం నుంచి భాస్కర్‌రావు, బొంత సురేశ్‌లు యాక్టివాపై ఎండు గంజాయి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 2.370 కిలోల గంజాయి బయటపడింది. వెంటనే వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. దీనితో సంబంధం ఉన్న దినకర్, నానిలు పరారీలో ఉన్నారని తెలిపారు.

సహాయం చేయబోయి.. ప్రాణాలు కోల్పోయాడు..

- రింగ్‌రోడ్‌పై టైర్‌కు రిపేర్ చేస్తుండగా ఢీకొన్న మరో కారు
- ఒకరు మృతి.. మరో ముగ్గురికి గాయాలు

బండ్లగూడ, మే 8: అర్ధరాత్రి రింగ్‌రోడ్డుపై ఓ వాహనం టైర్ పంక్చర్‌గా.. మరో వాహనదారుడు సహాయం చేస్తుండగా.. ఇంకో వాహనం వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో సహాయం చేయబోయిన వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన రాజేందర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిమాయత్ సాగర్ వద్ద బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట రుద్రారంకు చెందిన బోయిన మనోజ్ (25) కర్నూల్ నుంచి ఇంటికి వాహనంలో వస్తుండగా హిమాయత్‌సాగర్ వంతెన వద్ద రింగ్ రోడ్డుపై ఒక కారు ఆగి ఉండడాన్ని గమనించారు. ఆపదలో ఉన్నారని తెలుసుకొని కారు ఆపి.. వారిని ఆరా తీశారు. చంచల్‌గూడకు చెందిన మహమ్మద్ ఆజాం తాము మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వస్తుండగా కారు పంక్చర్ అయిందని వివరించారు. తాను సాయం చేస్తానని .. తన వద్ద ఉన్న జాకీతో కార్ రిపేర్ చేస్తుండగా అదే సమయంలో మాదాపూర్ నుంచి వేగంగా టయోటా కారుతో వస్తున్న ఎస్.కె మోయిన్ .. మహమ్మద్ ఆజం కారును ఢీకొన్నారు. అప్పటికే కారు రిపేర్ చేస్తున్న బోయిన మనోజ్‌ను కారు ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన మనోజ్ అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడే ఉన్న మహమ్మద్ ఆజం కుటుంబ సభ్యులు ముగ్గురు కూడా గాయాల పాలయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మనోజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. గాయాల పాలైన ఆజాం కుటుంబ సభ్యులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

బైక్ పార్కింగ్ విషయంలో గొడవ.. దాడి

ఇద్దరికి తీవ్ర గాయాలు..

ఐదుగురు అరెస్ట్

పోలీసుల అదుపులో నిందితులు

దుండిగల్, మే 8: బైక్ పార్కింగ్ విషయంలో తలెత్తిన వివాదంలో ఇద్దరిపై దాడికి పాల్పడిన ఐదుగురు నిందితులను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... నిజాంపేటలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్ -1లో గుడిపల్లి సంతోశ్‌కుమార్ అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అయితే అదే బ్లాక్ లోని ఓ ఫ్లాట్‌లో బిహార్‌కు చెందిన ధీరజ్ కుమార్ అద్దెకు ఉంటుండగా సమీపంలోని వేరు వేరు బ్లాకుల్లో అతని దగ్గరి బంధువులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సంతోశ్‌కు చెందిన బైక్ పార్కింగ్ స్థలంలో ధీరజ్ కుమార్ తరచూ బైక్ పార్కింగ్ చేస్తున్నాడు. పక్కకు జరపమని చెబితే గొడవకు దిగేవాడు. ఈ క్రమంలో ఈనెల 6న రాత్రి 11 :30 గంటల సమయంలో ధీరజ్ కుమార్ బంధువు ఒకరు సంతోశ్‌కు చెందిన పార్కింగ్ స్థలంలో ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేశాడు. అయితే సంతోశ్.. బైక్‌ను పక్కకు పెట్టమని ధీరజ్‌కుమార్ బంధువుకు చెప్పి.. ఇంట్లోకి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి అనంతరం ధీరజ్ కుమార్ బయటకు వచ్చి సంతోష్‌తో గొడవ పడి కొట్టాడు. పక్కబ్లాక్‌లో నివాసం ఉంటున్న బంధువులు సంతోశ్‌సింగ్, రోహిత్ కుమార్ సింగ్, మరో ఇద్దరు వచ్చి ఇనుప రాడ్లు, కర్రలతో సంతోశ్‌ను కొట్టి గాయపరిచారు. అడ్డుకోబోయిన సంతోశ్ బంధువు అబ్రహంపైన దాడికి తెగబడ్డారు. ఈ దాడుల్లో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులైన ధీరజ్‌కుమార్, కుమార్ సింగ్, రామ్ రతన్ సింగ్, సంతోశ్‌సింగ్, రోహిత్ సింగ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బెదిరించి రూ.1.23 కోట్లు దోచేశారు..

సైబర్ నేరగాడు అరెస్ట్

సిటీబ్యూరో, మే 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని డ్రగ్స్, స్మగ్లింగ్ చేస్తున్నావంటూ బెదిరించి.. అతని నుంచి దఫాల వారీగా రూ.1.23 కోట్లు దోచుకున్న సైబర్ నేరగాడు మహారాష్ట్రలోని పూణెకు చెందిన రాంప్రసాద్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన 45ఏళ్ల డాక్టర్‌కు ఒక మొబైల్ నుంచి కాల్ వచ్చింది. అందులో ఇండియన్ పోస్ట్ ఆఫీస్ నుంచి బాధితుడి పేరుమీద ఒక పార్సిల్ వచ్చిందని, అందులో 14 పోలీస్ యూనిఫామ్స్, 14ఐడీ కార్డ్స్, 3 డెబిట్ కార్డ్స్, 4 కెటమిన్ ఇంజెక్షన్స్ ఉన్నట్లుగా చెప్పారు. దీంతో డాక్టర్.. ఆ పార్సిల్‌తో తనకు సంబంధం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పగా.. సైబర్ నేరగాడు వెంటనే ఫేక్ పోలీసులకు లైన్ కనెక్ట్ చేశాడు. వాళ్లు డాక్టర్‌ను బెదిరించారు. ఆ తర్వాత వీడియోకాల్‌చేసి సీనియర్ పోలీస్ ఆఫీసర్స్ అంటూ బెదిరించారు. ఇలా బెదిరింపులకు పాల్పడి చివరకు వెరిఫికేషన్ కోసం డబ్బులు అడుగగా మొదట రూ.29లక్షలు పంపి.. ఆ తర్వాత విడతల వారీగా రూ.1.23కోట్లు పంపించాడు. చివరికి మోసపోయిన విషయాన్ని గ్రహించిన బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి రెండో నిందితుడు రాంప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడిపై తెలంగాణలో 4కేసులుండగా, దేశ వ్యాప్తంగా 22 కేసులున్నాయి.

రుణమాఫీ చేస్తామంటూ సైబర్ మోసం

బంజారాహిల్స్, మే 8: బ్యాంకులో ఉన్న రుణాన్ని మాఫీ చేయిస్తామని నమ్మించి..డబ్బులు వసూలు చేసిన సైబర్ నేరగాళ్లపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లో నివాసం ఉంటున్న చేబెల్లి వెంకన్న అనే వ్యక్తి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉన్న రుణంలో 2.40 లక్షల మేర మాఫీ చేసేందుకు ఆఫర్ వచ్చిందని రెండ్రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. అయితే రూ.56,800 ఫీజులు చెల్లిస్తే వెంటనే మాఫీ అవుతుందని నమ్మించాడు. అతడి మాటలు నమ్మిన వెంకన్న.. సంపత్‌నాని, బూక్యా నాని అనే పేర్లతో ఉన్న నంబర్లకు యూపీఐ ద్వారా చెల్లించాడు. ఆ తర్వాత బ్యాంక్‌కు వెళ్లిన వెంకన్న ఆరా తీయగా.. తమ బ్యాంక్ తరపున ఎలాంటి రుణమాఫీ చేయలేదని, బ్యాంక్ నుంచి ఎవరూ కాల్ చేయలేదని చెప్పారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి గురువారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళకు వేధింపులు.. పోలీసులకు ఫిర్యాదు

వెంగళరావునగర్, మే 8: ఓ మహిళ ఫోన్ నంబర్‌కు నగ్న చిత్రాలు, అసభ్యకరమైన సందేశాలు పంపి వేధింపులకు గురిచేస్తున్నాడో ఆకతా యి. ఇంటికొచ్చి కోరిక తీర్చి వెళ్లాలం టూ వేర్వేరు 20 ఫోన్ నంబర్ల నుంచి ఫోన్లు చేస్తూ క్షోభకు గురిచేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. వెంగళరావునగర్‌లో నివాసం ఉండే ఓ జాతీయ పార్టీకి చెందిన మహిళా నాయకురాలికి ఈనెల 6న తెలియని నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తన పేరు రవి అని..శారీరకంగా కలవాలనుకుంటున్నట్టు చెప్పాడు. వెంటనే ఆమె ఫోన్ కట్ చేసింది. మరో ఫోన్ నంబర్ నుంచి ఆ మరుసటి రోజు కాల్ చేసి తన ఇంటికొచ్చి కోరిక తీర్చాలని కోరాడు. అతని ఫోన్ నంబర్ గురించి పరిశీలించగా విపక్ష రాజకీయ పార్టీకి చెందిన ఓ మహిళా కార్పొరేటర్ డీపీ పెట్టుకున్నట్లు గుర్తించింది. దాదాపు 20 ఫోన్ నంబర్ల నుంచి ఫోన్లు చేస్తూ సతాయిస్తున్న ఆ పోకిరిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తెలతాడు పోలీసులకు అప్పగింత

శామీర్ పేట్, మే 8: బొమ్మరాసిపేట గ్రామానికి చెందిన రాచకొండ రాజు కుమారుడు సన్నీ కీసర మండలం, చిర్యాల గ్రామంలోని పీఐ స్విమ్మింగ్ క్లబ్‌లో స్విమ్మింగ్‌కు వెళ్లాడు. ఈత కొడుతున్న సమయంలో నీటిలో దాదాపు మూడు తులాల బంగాలు పుస్తెల తాడు దొరకగా.. దానిని తండ్రికి ఇవ్వగా.. అతను శామీర్‌పేట పోలీసులకు అప్పగించారు. విచారణ చేపట్టిన పోలీసులకు ఈ నెల 5న ఈత కోసం వచ్చిన గవ్వల మౌనిక బంగారు పూస్తేలతాడుగా గుర్తించి.. ఆమెకు అందజేశారు. మానవతా దృక్పథంతో వ్యవహరించిన దివ్యాంగుడైన రాజును సీఐ శ్రీనాథ్, పోలీస్ సిబ్బంది శాలువాతో సత్కరించి అభినందించారు.

వ్యభిచార గృహంపై దాడి..ఇద్దరు అరెస్ట్

హిమాయత్‌నగర్,మే 8: గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులను నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..ఏపీ, కడప జిల్లాకు చెందిన సంగటి నాగేశ్వర్ రెడ్డి(56), నెల్లూరు జిల్లాకు చెందిన సి.ప్రభావతి(61)లు హిమాయత్‌నగర్‌లో ఓ ప్లాట్‌ను అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న డీఎస్సై వెంకటేశ్, ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై కరుణాకర్ రెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి వ్యభిచార గృహంపై దాడి చేశారు. ఇద్దరు విటులతో పాటు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుల నుంచి రూ.3 వేలు నగదుతో పాటు 6 కండోమ్ ప్యాకెట్లు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు నాగేశ్వర్ రెడ్డిపై 2004లో చిక్కడపల్లి, 2008లో పంజాగుట్ట, 2012లో జూబ్లీ హిల్స్ పోలీస్ స్టేషన్‌లలో వ్యభిచార నేరంలో అరెస్టు అయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి వ్యాఖ్యలు విడ్డూరం

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కరువు భత్యం విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేంద్ర బాబు, ఎంవీ నర్సింగరావులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కరువు భత్యం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ల న్యాయమైన హక్కు అని, ఐదేండ్ల కోసారి పీఆర్‌సీ వేయడం ఆనవాయితీ అని, వాటిని నెరవేర్చాలంటూ తాము నిరసన తెలుపడంలో తప్పులేదన్నారు. ముందుగా ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను గుర్తు చేసుకోవాలన్నారు.

బైకర్ నిర్లక్ష్యం.. యువతి మృతి

మియాపూర్, మే 8: ముందు వెళ్తున్న ఓ బైకర్ సడెన్‌గా రైట్ టర్న్ తీసుకోవడంతో బైక్ తగిలి స్కూటీపై వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో వెనుకాలే వచ్చిన ఆర్టీసీ బస్సు ఆ యువతిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆర్‌సీపురంలోని అశోక్‌నగర్‌లో నివాసం ఉండే బి.గోపి ప్రియ(29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. ప్రతి రోజు మదీనగూడలోని కల్ట్ ఫిట్‌నెస్ సెంటర్‌లో యోగా సెషన్‌కు వెళ్తుంది. గురువారం ఉదయం యోగా సెషన్ ముగిసిన తర్వాత స్కూటీపై మియాపూర్ నుంచి చందానగర్ వైపు వెళ్తుంది. ఉదయం 7 గంటల సమయంలో మదీనగూడ అర్చన హాస్పిటల్ ఎదురుగా ప్రధాన రహదారిపై ముందు వెళ్తున్న ఓ బైకర్(టీఎస్07హెచ్ 8682) అకస్మాత్తుగా కుడి వైపు తిరగగా, వెనుకాల వస్తున్న గోపి ప్రియ స్కూటీకి బైక్ తగలడంతో కిందపడిపోయింది. ఆ వెనుకాల వచ్చిన ఆర్టీసీ బస్సు(టీజీ10టి0600) గోపిప్రియ పైనుంచి వెళ్లింది. ఈ ప్రమాదంతో తీవ్రంగా గాయపడ్డ ఆమెను జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు, వాహనదారులు పక్కనే ఉన్న అర్చన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గోపిప్రియ ఉదయం 8. 20 గంటలకు మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. తన కుమార్తె మృతికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్, బైకర్‌లపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బతుకమ్మ కుంటపై స్టేటస్ కో..

జూన్10వరకు ఎలాంటి పనులు చేయరాదన్న హైకోర్టు

సిటీబ్యూరో, మే 8(నమస్తే తెలంగాణ): బాగ్‌అంబర్‌పేట, బతుకమ్మకుంటలోని ఏడెకరాల వివాదాస్పద భూమిపై హైకోర్టు వెకేషన్ బెంచ్ జూన్ పదవతేదీ వరకు స్టేటస్‌కో విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. బతుకమ్మకుంటను స్వాధీనం చేసుకుని అక్కడ పనులు చేపడుతున్న హైడ్రాకు ఈ ఉత్తర్వులతో చుక్కెదురైంది. బతుకమ్మకుంట భూమికి సంబంధించి తనకు సేల్‌అగ్రిమెంట్ ఉందంటూ పిటిషనర్ ఎ.సుధాకర్‌రెడ్డి సిటీ సివిల్ కోర్టులో గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు జస్టిస్ సురేపల్లి నంద, జస్టిస్ శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం సుధాకర్‌రెడ్డి వాదనలు విని బతుకమ్మకుంటలో జూన్ 10వరకు యథాతథ స్థితి కొనసాగించాలని స్టేటస్‌కో విధిస్తూ ఇరుపక్షాలు అక్కడ ఎలాంటి పనులు చేపట్టరాదని హైడ్రాను, హెచ్ఎండీఏను, రెవెన్యూ అధికారులతో పాటు ప్రైవేటు పార్టీలకు ఆదేశాలిచ్చింది. బతుకమ్మకుంట వివాదాస్పద భూమి విషయంలో అన్ని డాక్యుమెంట్స్, సాక్ష్యాలు పరిశీలించిన తర్వాత వివాదాన్ని పరిష్కరిస్తామని చెబుతూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్